కల్వకుర్తిలో క్రీడా సందడి!

▶ రెండో రోజూ హోరెత్తిన ఉమ్మడి పాలమూరు జిల్లా స్థాయి పోటీలు!

▶ ఆడపిల్లలే స్టార్లు! మగ పిల్లలకు దీటుగా కబడ్డీ, వాలీబాల్, ఖో ఖో లో దూసుకుపోతున్న బాలికలు!



తెలంగాణ స్టేట్ బ్యూరో చీఫ్, నవంబర్ 12 (విజన్ ఆంధ్ర):

కల్వకుర్తి పట్టణం ఇప్పుడు క్రీడా మయంగా మారింది. ఉమ్మడి పాలమూరు జిల్లా స్థాయి అండర్-17 క్రీడా పోటీలు మహాత్మ జ్యోతిబాపూలే బాలికల పాఠశాలలో రెండో రోజు కూడా ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగాయి. గురువారం ఉదయం నుంచే పాఠశాల ప్రాంగణం చిన్నారుల కేరింతలు, ఈలలు, చప్పట్లతో మార్మోగిపోయింది.

కబడ్డీ, వాలీబాల్, కోకో, షాట్ పుట్ వంటి క్రీడల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ప్రతి మ్యాచ్ లోనూ గెలుపు కోసం నువ్వా నేనా అన్నట్టుగా పోటీ పడ్డారు. ఒక్క పాయింట్ కోసం కూడా వదులుకోకుండా చాకచక్యంగా, పట్టుదలతో ఆడిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఓడిన జట్టు కూడా నిరాశ పడకుండా మళ్లీ గెలవాలనే కసితో ఆడటం ఈ పోటీల ప్రత్యేకతగా నిలిచింది.

చలిని లెక్కచేయని చిన్నారుల కసి!

ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు తమ పాఠశాలలకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలనే లక్ష్యంతో బరిలోకి దిగారు. చలిని సైతం లెక్కచేయకుండా ఉదయాన్నే లేచి వ్యాయామం చేస్తూ, వార్మప్ అవుతూ ఆటల్లో పాల్గొంటున్నారు. తెల్లవారుజామునే గ్రౌండ్ లోకి వచ్చి ప్రాక్టీస్ చేస్తున్న పిల్లలను చూస్తే క్రీడల పట్ల వారికున్న ఇష్టం ఎంతో అర్థమవుతుంది.

కేవలం గెలుపు కోసమే కాదు.. క్రమశిక్షణ, జట్టుగా ఆడటం, ఓటమిని స్వీకరించడం, ప్రత్యర్థిని గౌరవించడం వంటి విలువలను ఈ పోటీలు పిల్లలకు నేర్పిస్తున్నాయి. అందుకే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కూడా ఈ పోటీలను ఎంతో సంతోషంగా చూస్తున్నారు.

ఆడపిల్లల ఆటకు అందరూ ఫిదా! మగ పిల్లలకు దీటుగా సత్తా!

ఈ పోటీల్లో అందరి దృష్టిని ఆకర్షించింది ఆడపిల్లల ఆట తీరే. ఎటువంటి ఇబ్బందులకు తలొగ్గకుండా మగ పిల్లలకు దీటుగా ఆడపిల్లలు ఆడుతున్న తీరు చూసి ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోతున్నారు. కబడ్డీలో రైడ్ చేస్తున్నా, వాలీబాల్ లో స్మాష్ కొడుతున్నా, కోకోలో పరుగులు తీస్తున్నా.. ఆడపిల్లల వేగం, చురుకుదనం, ధైర్యం చూసి ప్రేక్షకులు చప్పట్లతో అభినందిస్తున్నారు.

గురుకులాల్లో ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం వల్ల వారిలో మరింత స్టామినా, బలం పెరిగిందని చెప్పవచ్చు. మంచి ఆహారం, మంచి శిక్షణ, మంచి వసతులు ఉంటే ఆడపిల్లలు ఏ రంగంలోనైనా ముందుంటారని ఈ పోటీలు మరోసారి రుజువు చేస్తున్నాయి. ఆడవాళ్లు అన్నింట్లో ముందుండాలనే ధోరణితో ఈ పాఠశాలలో జరుగుతున్న ఆటలు చూస్తుంటే మగవారికి సమానంగా ఆడపిల్లలు ఆడుతున్న ఆటలు అందరినీ మంత్రముగ్ధులను చేస్తున్నాయి.

మూడు రోజుల పాటు సాగనున్న క్రీడా పండుగ!

అండర్-17 క్రీడలు మొత్తం మూడు రోజుల పాటు సాగనున్నాయి. మొదటి రోజు ప్రారంభమైన ఈ క్రీడా పండుగ రెండో రోజుకు మరింత జోరు అందుకుంది. మూడో రోజు అండర్ 17 ఫైనల్ పోటీలు, బహుమతుల ప్రదానంతో మరింత ఘనంగా ముగియనున్నాయి. ఏ పాఠశాల విజేతగా నిలుస్తుందోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అండర్ 14,19 క్రీడలు మరో మూడు రోజులు సాగనున్నాయి.

560 మంది విద్యార్థులు.. పకడ్బందీ ఏర్పాట్లు

- ప్రిన్సిపాల్ డాక్టర్ నాగమణి



ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగమణి మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాల నుంచి 560 మంది విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొన్నారని తెలిపారు. అన్ని పాఠశాలల పీఈటీ, పీడీలు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారని చెప్పారు.

విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నీళ్ల వసతి, భోజన వసతి కల్పించడం జరిగిందని తెలిపారు. ప్రతిరోజూ రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు కల్చరల్ ప్రోగ్రామ్స్ కూడా నిర్వహించి పిల్లలను ఉత్తేజపరుస్తున్నామని అన్నారు. ఆటలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలతో పిల్లల్లో దాగున్న ప్రతిభను వెలికితీస్తున్నామని చెప్పారు.

క్రీడలు కేవలం ఆటలు మాత్రమే కాదు.. పిల్లల్లో ఆత్మవిశ్వాసం, ఆరోగ్యం, క్రమశిక్షణ పెంచే సాధనమని ప్రిన్సిపాల్ అన్నారు. ఈ పోటీల ద్వారా జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి, జాతీయ స్థాయికి ఎదిగే క్రీడాకారులు తయారవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

మొత్తం మీద కల్వకుర్తిలో జరుగుతున్న ఈ క్రీడా పోటీలు చిన్నారుల భవిష్యత్తుకు బంగారు బాట వేస్తున్నాయి.